# మెషీను

యంత్రవతుగా రోజులూ, పనులూ, తిండీ, నిద్రా చూచే సుబ్రహ్మణ్యానికి మెషీన్ అని పేరు పెట్టారు మిత్రులు. నడుస్తుంటే గూడా యంత్రంలాగే నడుస్తాడని నవ్వేవారు. మేనమామ ప్రెస్ పెడితే అందులో పని నేర్చుకున్నాడు. పొద్దున తమ్ముళ్లూ చెల్లెళ్ళతో అన్నం దిని, వాళ్ళను బడికి తోలి తాను ప్రెస్‌కి వెళ్ళేవాడు. యేడున్నరనించీ పదిన్నరవరకూ ఒంటి కాలి మీద నిలబడి రెండో కాలి పాదంతో ట్రెడిల్ తొక్కుతూ, కాగితం పెట్టనూ యెడం చేత్తో తీయనూ పక్కనుంచనూ చేసేవాడు. మేనమామ మెచ్చి సాఫ్ట్ డ్రింక్ తెప్పించి తాగించి పంపేవాడు.

అట్టి మెషీన్‌కి వయసు రావటం చూసి వాళ్ళమ్మ పెళ్ళి చూపులకు రమ్మన్నది.

అంటే మరో మెషీన్ యీ యింట్లో పని చేస్తుందన్న మాట. దానికి చూపులెందుకూ? ఫిట్ అవునా కాదా? కొత్త మెషీనేనా? సెకండ్ హాండా? కనిబెట్టాలి. కొత్తదైతే దాన్ని నడిపించటం చాతగావాలి అన్నాడు మెషీన్.

తల్లి నవ్వింది. ఆ నవ్వుకీ సమాధానమిచ్చాడు.

నువ్వు చూడు. నువ్వేగా దాన్ని నడిపేదీ. అన్నాడు.

చిన్ననాటి స్నేహితుడు చాలా కాలానికి తారసిల్లి ఇప్పుడూ విరామం లేకుండా, అంత పనీ చేస్తున్నావా? సుబ్బులూ? అని పరామర్శించాడు. మన స్నేహితులు మరొకవూళ్ళో కనబడితే, నిన్ను గురించి వాకబ్ చేస్తే, 'వాడా మెషీన్' అని నవ్వి జవాబివ్వకుండా వెళ్ళిపోయారు. స్నేహితుడు నవ్వుతూ అడిగాడు.

మరొక మెషీన్ వచ్చింది. కొంత పని తగ్గింది. అనుకుంటుంటే యింట్లో యింజన్ కూత మొదలైంది. ఇంజను నీళ్ళొదులుతున్నది పోయి చూసుకో, అంటే, అడివి మనిషిని చూసినట్టు చూస్తుంది. కాని యింజన్ మూలబడంగానే యేడుస్తుంది. తప్పుతుందీ. మెషీన్‌లో లోపమెక్కడా? యే సీల పని చేయటం లేదూ, బెట్టుగా వున్నట్టున్నదే, అని పరిశీలించి, క్లీన్ చేసి ఆయిల్ వేయగానే, ఆ యింజను యిల్లంతా తిరుగుతూ, నీళ్ళు పారబోయనూ, గిన్నెలు గరిటలూ చప్పుడు చేయనూ చేస్తుంది. అని వెళ్ళిపోయాడు.

సుబ్రహ్మణ్యం వెళ్ళినవేపే చూశాడు స్నేహితుడు.

అదేమిటోయ్! సుబ్బులూ! నిక్షేపమంటి వుద్యోగానికి, తిలోదకాలిచ్చావూ? అని నిలేశాడు మరో ఫ్రెండ్.

యెట్లా ఆ వుద్యోగం వెలిగించటం? పది నిమిషాల్లో యిరవై పేజీల మాటర్ టైప్ చేయమంటాడు బాస్. పోనీ చేతాము. మెప్పిద్దామంటే చిత్తు ప్రతినిండా, హింసపాదులూ, స్పెల్లింగ్ మిస్టేక్స్. టైమ్‌కి యింటికి పోయానుట ఇంకో తప్పు పట్టి, హారన్ కొట్టినట్టు అరుస్తాడు. నన్ను 'మెషీన్! మెషీన్!' అని పిలుస్తాడుగానీ, నాడి బ్రెయిన్ పాడైంది. అదే తెలియజెప్పాను. 'నన్ను మీ యింటికి పోయి యేదో చేయమన్నారుగానీ, మీ యింట్లో వున్న ఆడ మెషీన్ మరొక కంపెనీది, పాడైపోయింది. రిపేర్సుకు వచ్చింది. కిచిన్‌లో నన్ను నడిపించాలని చూసింది సార్! నేనేం నిషధేశ్వరుడినా, నల మహారాజునా, నలపాకం చూపాలిట. నాకు నివ్వు చేయటమే

రాదు. ఊరికెనే స్టౌ వెలిగించటం రాదు. అన్నా. గాస్ అయిపోయింది. పోయి సిలిండర్ తీసుకురా. యిది తీసికెళ్ళు. అంటుందిగా నీ బాస్! డబ్బివ్వదు. మంచి మెషీన్ మెకానిక్ అయిన మీ తల్లిగార్ని వెంటబెట్టుకెళ్ళి, మరో మెషీన్ సెలెక్ట్ చేయించి తెచ్చుకోండి' అన్నా. ఇంటిమేట్ చేశానుట. హీట్ యెక్కువై ఆపకుండా 'కూ' అని కూస్తూ, హెడ్‌లైట్స్ వేసి డాష్‌గా డ్రైవ్ చేసి, పోయి, ఆక్సిజన్ టెంట్‌లో యిరుక్కున్నాడు. నేనే కారణంట. శ్రీముఖమిచ్చాడు. పోనీయండి. వేరే వర్క్ షాప్‌లోకి పోతా'నని గుడ్‌బై చెప్పాను. అన్నాడు ద్రేకం లేకుండా.

అదంతా విన్న ఫ్రెండ్ ఆపకుండా నవ్వాడు.

సుబ్రహ్మణ్యం తండ్రి బిజినెస్ రన్ చేస్తున్నాడు. పెద్దవాడై పోయాడు. కూరలకొట్టూ, పాలపొట్లాల యేజన్సీ తీసుకుని, పాలపొట్లాలు యిరవై నాలుగ్గంటలూ ప్రజలకందీయటం, చిన్న బిడ్డల్ని దించిపోతే, వాళ్ళెటూ పోకండా చూడటం, ఆహారమివ్వటం, చిట్కావైద్యం ఆయన బిజినెస్. సుబ్రహ్మణ్యం తండ్రి చేసే అష్టావధానంలో పాల్గొన్నాడు. విరామ సమయంలో మెటీరియా మెడికా పఠించాడు. చాలా యింటరెస్టింగ్‌గా వున్నది. మందు మింగించటం తేలిక. ఆయుర్వేద ఔషధంలాగా క్రూరంగా వుండదు. తమ్ముడు మెడిసిన్ చదువుతున్నాడు. వాడి మెడికల్ గ్రంథాలు, ఎనాటమీ, ఫిజియాలజీ, జనరల్ మెడిసిన్ యింటరెస్టింగ్‌గా వున్నాయి. ఫార్మకాలజీ యింకా బావుంది.

తండ్రి పడకవేశాడు. అయినా చూశామని, మెషీన్ యెక్కడ పాడైందీ అనీ, యేవి తుప్పుపట్టినై, స్పేర్ పార్ట్సు వేయాలా అని చూస్తూ హోమియోపతీ అప్లై చేశాడు సుబ్రహ్మణ్యం. చిత్రం! రిపేర్లు పూర్తయి రోడ్డెక్కిన కారులాగా, తండ్రి లేచి తన బిజినెస్ మరింత శ్రద్ధగా రన్ చేయసాగాడు బసియస్ పాసైనట్టు, ఇండియన్ కుకింగ్ సర్వీస్ అని బల్ల కట్టి, కేకులూ, బిస్కట్లూ, అయిస్క్రీమూ, అద్దాల బీరువాలలో ఆకర్ష వంతంగా వుంచి, బిజినెస్ యింప్రూవ్ చేసి మోడరనైజ్ చేశాడు తండ్రి.

సుబ్రహ్మణ్యానికి తన మీద తనకే నమ్మకం కలగ సాగింది. కేర్‌టేకర్‌లాగా షాపులో కూచున్నాడు. ఒకమ్మాయి, పాతికేళ్ళుంటాయి, యేడుస్తూ వచ్చి, గుడ్డలో చుట్టి తెచ్చిన చిన్న మెషీన్ని బల్లమీదుంచి గుడ్డలు తొలగించింది.

పాలు తాగదు. కుదలదు. కళ్ళు తెరవదు. యాడవదు. బతికుందో లేదో గూడా తెలియటం లేదండీ. కళ్ళ నీళ్ళు విడుస్తు అన్నది.

ముందు మీరు నీళ్ళొదలటం మానాలి. నే చూస్తాగా. అలా కూచోండి. ఈ డ్రింకు తాగండి. ఇది గ్లూకన్‌డి. మనో బలం వస్తుంది. అని ఓదార్చి సింపతైజ్ చేస్తు వివరాలడిగాడు.

వంటిమీద ఆచ్ఛాదన లేని నెలల బిడ్డని టెస్టు చేశాడు. యూరిన్ సీసాలో పట్టమని చూశాడు. ఇంత చిన్న మెషీన్, యింకా రోడ్డుమీదన్నా నడవటం లేదుట. పక్కమీదే వుంటుంది. యెక్కడ పాడైందీ అని చూశాడు. మెడికా కన్సల్టు చేశాడు.

యేం భయం లేదమ్మా, లివర్ పాడైంది. నయమవు తుంది. ఇదుగో మందు. ఇది వాడటం తేలిక. బాధాకరంగా వుండదు. కానీ జ్వరం వస్తుంది. భయపడకండి. జ్వరం తగ్గిపోతుంది. గేదెపాలూ, ఆవుపాలూ మానేయాలి. టి.వి. మీద ఎడ్వర్టయిజ్ చేస్తారు చూడండి. ఆ టిన్‌ఫుడ్ వాడాలి. లేదా ఆస్టర్ మిల్క్. టిన్ పౌడర్‌తో పాలు తయారుచేసి తాజా పాలు తాగించాలి. నయమవుతుంది. అని ధైర్యం నూరిపోసి పంపాడు.

ఆశ్చర్యం! ఒక్క ఫిల్ములో నటించి, లీడింగ్ లేడీ వేసి, రాత్రికి రాత్రే తారాపథాని కెగిరి తార అయినట్టు సుబ్రహ్మణ్యం ఘనవైద్యుడని పేరు గాంచాడు. హస్తవాసి మంచిదని, కీర్తి తెచ్చుకున్నాడు. పాపకు నయమై, పారాడి, నడిచి ఒళ్ళు చేసి రోడ్డుమీద అందకుండా పరుగెత్తుతున్నది.

కలీమూర్, కలీఫాస్‌తో మొదలెట్టి సుబ్రహ్మణ్యం యిప్పుడు "హానిమాన్ హాల్" అని హోమియో మందుల షాపు ఓపెన్ చేశాడు. వర్క్‌షాప్‌లోకి రిపేర్సు కోసం వచ్చినట్టు మనుషులు వస్తారు. నిదానంగా వివరాలు లాగుతాడు. మెషీన్ యెక్కడ పాడైందీ అన్నట్టూ, మొత్తం మెషీన్ వూడదీసినట్టు, అంతకుముందు జరిగిన వైద్యం గూడా లాగుతాడు. రిపేర్సు చేసి కారు యిచ్చేసినట్టు మనిషిని పంపేస్తాడు. ఆ విధంగా వర్క్‌షాప్ పెద్దదైంది. ఆదాయమూ పెరిగింది.

మిస్టర్ మెషీన్ మీరేనా? అన్నాడో సూటువాలా, నిలబడే వున్నాడు.

కూచోండి. వస్తున్నా. కంటిముందు వాడటం చూపిస్తున్నా. నేర్చుకుంటున్నాదీ ఆసామీ. మెత్తవున్న సోఫా చూపాడు.

నలభై మైళ్ళ వేగంతో వెళ్తున్న కారులాగానూ, రద్దీగా వున్న చోట హారన్ కొడుతున్నట్టు ప్రశ్నలేస్తు, సిగ్నల్స్ చూసి కారాపినట్టు, నోట్‌బుక్ కన్సల్ట్ చేస్తూనూ, మందులిచ్చి, ప్రిస్క్రిప్షన్స్ రాసిచ్చి పంపేశాడు. అందర్నీ పంపేసి వచ్చి కూచున్నాడు. నవ్వుతూ చూశాడు సూటువాలాను.

నువ్వా! సుబ్బలూ! ఘనవైద్యుడూ, మెషీనూ నేను గుర్తున్నానా? మెడిసినెప్పుడు చదివావూ? సూటువాలా అడిగాడు.

బాబు అల్లోపతీ పుస్తకాలూ, ఆయుర్వేదమూ అన్నీ చదివారు. పాడైన భాగం బాగుచేసి దయగా మాట్లాడి మళ్ళా పనికి వచ్చేట్టు చేసి పంపిస్తాడు. అన్నాడు అసిస్టెంట్.

నీ మీదకి కేసురాదూ? సూటు ఆసామీ అడిగాడు.

డిగ్రీలున్నవాళ్ళు యెంతమందికి సరైన వైద్యం చేస్తున్నారు. డయాగ్నొసైజ్ యెంతమంది కరెక్ట్‌గా చేస్తున్నారూ? వాళ్ళమీదకి కేసు లెక్కాయా? యెన్ని ట్రీట్‌మెంట్స్ ఫెయిలవుతున్నాయి? వైద్యం మానారా, ప్రాక్టీస్ మానారా? నా బ్రెయిన్ బాగా పని చేస్తున్నది. మా నాన్న యిప్పటికీ, తేలు కుట్టి యేడుస్తూ వచ్చినవారి కాలి వేలు మీద పొటాషియం పర్మాంగనేట్ పోసి యేడుపు కట్టిస్తున్నాడు. నువ్వు భరణివి. మీ నాన్న కెమిస్ట్రీ ప్రొఫెసర్. ఆయన తన పిల్లలకు యే

నక్షత్రాన పుడితే ఆ నక్షత్రం పేరు పెట్టేవాడు. మీ అక్క పేరు స్వాతి. కూతుళ్ళనేమో ది వన్, ది టూ అని వుదహరించేవాడు. కొడుకులను యస్ వన్, యస్ టూ అనేవాడు. మీ అమ్మను మూలాధార అనీ, తన తల్లిని సీతాబిరాట్టి అనీ పేర్కొనేవాడు. ఆయనకు మధుమేహం వచ్చింది. డయట్ అబ్జర్వ్ చేస్తు చిక్కి శల్యమై, దివికేగాడు. నువ్వు పట్టశక్యం కాకుండా యేడుస్తుంటే, మన పొరుగింటాయన, చూడలేక, మెషీన్ బాగా తుప్పు పట్టి పనికిరాకుండా పోయింది, నాయనా! చాలా యేళ్ళు పని చేసింది. యెన్ని రిపేర్లకు తట్టుకున్నదీ, యెంత ప్రజా సేవ చేసిందీ, యేడవరాదు. దేవుడు నీకు కొత్త మెషీనిస్తాడు. నువ్వా మెషీన్‌తో కాలక్షేపం చేద్దువుగాని అని వోదార్చాడు. తరవాత నీకు పెళ్ళి అయి మరో మెషీన్ వచ్చింది. అని నవ్వాడు.

వండర్ ఫుల్! చాలా గుర్తున్నాయి. నీ పేరు దిగంతాలకు వ్యాపిస్తుంటే, నన్ను గూడా రిపేర్ చేయగలవేమోనని వచ్చాను. అన్నాడు సూటాయన.

నాల్రోజులుండు. అన్నీ వినాలి. శరీరమనే మెషీన్ యెక్కడ పనిచేయలేక పోతున్నది కనిబెట్టాలి. ముందు విశ్రాంతి అవసరం. బాగా బడలి, నిరాశక్కూడా లోనైనట్టు కనిపిస్తున్నావు. అన్నాడు సుబ్రహ్మణ్యం.

యంత్రవతు పనిచేస్తున్న స్నేహితుని దినచర్య గమనించాడు భరణి. తెల్లవారుజామున బ్రాహ్మీ ముహూర్తాన లేస్తాడు. కాలకృత్యాలు, స్నానం, జపం అరగంట. ఇంటి

పన్నులో సాయపడతాడు. ఫలహారం పండురసం తీసుకుంటాడు. సూర్యోదయమవుతుండగా కొట్టుతీసి, మందులన్నీ వున్నాయా చూస్తాడు. కన్సల్టేషన్ రూమ్ అందంగా వుంచుతాడు. యేడుగంటలనించీ వర్క్‌షాప్. మెషీన్లల్లోనే వున్న యిద్దరు అసిస్టెంట్స్ వస్తారు. నోట్‌బుక్స్ కన్సల్ట్ చేస్తూ, ఆల్ఫబెటికల్ ఆర్డర్లో పేర్లు చూస్తాడు. కంప్లెయింట్స్ విని మెషీన్సు చూసినట్టే చూస్తాడు. కొనుక్కుంటాము అంటే సీసాలు, మందే యివ్వమంటే, హోమియో మాత్రలు పొట్లాలు కట్టి పేర్లు వ్రాసి యిస్తాడు. ఇలా పదకొండున్నర వరకూ. తర్వాత పూజ. పన్నెండింటికి భోజనం. గంట విరామం. ఇంటి విషయాలు వింటాడు. గంట గ్రంథాలు చదువుతాడు. రెండింటినించీ మళ్ళా వర్క్‌షాపు. బిజినెస్సూ, పేషన్స్, సింపతీ, సోదివినుట అనే ముఖ్యమైన స్పేర్‌పార్ట్స్ యెక్కువ డిమాండులో వుండుట గమనించాడు భరణి. ఆ స్పేర్ పార్ట్స్‌కి లోపం లేకుండా వుంచుకుంటాడు సుబ్రహ్మణ్యం. అదీ గమనించాడు భరణి.

భరణీ! శలవుపెట్టి నా దగ్గరుండు. నయమవుతుంది. మందుల కంపెనీలో మందులు తయారుచేస్తూ, నీ ఆరోగ్యం సంగతి మరిచావు. మందుల ఘాటు కళ్ళజోడు ఫల్నియా, యూరిన్ ఇఫెక్షన్ వచ్చాయి. రెండూ బాగుచేయచ్చు. విశ్రాంతివల్లా మార్పువల్లా, ఔషధంవల్లా మామూలు మెషీన్‌వి అవుతావు. బతికి వుండటం, ఆరోగ్యంగా వుండటమనేవి చాలా ముఖ్యం. జీతనష్టానికి వెరవకు. నా దగ్గరుంటే, రకరకాల మెషీన్లని

చూసి, జనరల్ నాలెడ్జ్ పెంచుకుంటావు. ప్రపంచాన్ని గమనించాలి. అది గూడా మందే. అన్నాడు సుబ్రహ్మణ్యం, నవ్వు మొహం.

భరణి తల వూపాడు. వుంటా. ఇష్టమే. నీ పెళ్ళి ఫోటోలో వున్నమ్మాయి కాదే యింట్లో తిరుగుతున్న మెషీనూ. నవ్వుతూ అడిగాడు.

ఆ మెషీన్ రెక్‌లెస్‌గా తిరుగుతూ నాన్‌స్టాప్ వర్కింగ్ మెషీనై, అనేక రిపేర్లకు లోనై, డాష్‌కు లోనై పేలిపోయింది. ఈ మెషీనూ రిపేర్సుకోసమే వర్క్‌షాపులోకి వచ్చింది. బాగై, యిక్కడే బాగున్నదని వుండిపోయింది. అన్నాడు సుబ్రహ్మణ్యం.

భరణి ఆపకుండా నవ్వసాగాడు.

— ౦ —